11నుంచి శాసనసభ సమావేశాలు

బెంగళూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలు ఆగస్టు 11నుంచి 22వరకు తొమ్మిదిరోజులపాటు నిర్వహించేలా గెజిట్ జారీ చేశారు. రోహిత్ వేముల చట్టం, తప్పుడు సమాచారం, అబద్ధాల ప్రచార నిషేధ చట్టం, ద్వేష ప్రసంగాలు, ద్వేషపూరిత ప్రసంగాల నియంత్రణ చట్టాలు సభ ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఆర్సీబీ విజయోత్సవాల వేళ తొక్కిసలాట ప్రమాదం, ప్రభుత్వం కొత్తగా కులగణనతోపాటు వివిధ అంశాలపై సభలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ జయంత్ బెనర్జీ

హైకోర్టు న్యాయమూర్తుల
ప్రమాణ స్వీకారం

బెంగళూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ జయంత్ బెనర్జీ, జస్టిస్ దినేశ్‌కుమార్ సింగ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి జస్టిస్ కామేశ్వరరావు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరే గౌడ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ పాల్గొన్నారు.

సీజేగా జస్టిస్ విభు బఖ్రు ప్రమాణ స్వీకారం

మెయిన్‌లో..



ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ దినేశ్ కుమార్ సింగ్



గ్రేటర్ బెంగళూరులో 5 నగర పాలికెలు

- గెజిట్ జారీ చేసిన ప్రభుత్వం
- అభ్యంతరాలు, సలహాల స్వీకరణకు అవకాశం

బెంగళూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు చట్టం ప్రకారం 5 నగర పాలికెలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర నగరాభివృద్ధిశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో బెంగళూరు పశ్చిమ నగర పాలికె, దక్షిణ నగర పాలికె, ఉత్తర నగర పాలికె, పూర్వ (తూర్పు)నగర పాలికె, కేంద్ర (సెంట్రల్) నగర పాలికెలుగా విభజిస్తూ ఆదేశాలు జారీ చేశారు. జనాభా విస్తీర్ణం, జనసాంద్రత, ఆదాయం, వ్యవసాయేతర వ్యవహారాలు, ఉద్యోగాలు, ఆర్థిక ప్రాముఖ్యత ప్రదేశాలలో లభ్యమయ్యే మౌలిక సదుపాయాలకు అనుగుణంగా గ్రేటర్ బెంగళూరు పరిధిలో 5 నగర పాలికెలను ఏర్పాటు చేసేందుకు ప్రస్తావించారు. ప్రతి నగర పాలికెకు సరిహద్దులు, నిర్దిష్టమైన ప్రదేశాన్ని పొందుపరుస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. నెలరోజులలోపు నగరంలోని ఎవరైనా వ్యక్తి అభ్యంతరం లేదా సలహాలను ప్రభుత్వాని పంపితే వాటిని పరిగణిస్తామని గెజిట్ నోట్‌లో పేర్కొన్నారు. ఏ విధమైన సలహాలు, ఫిర్యాదులను ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి, చాంబర్ 434, నాల్గో అంతస్తు, వికాస సౌధ, డాక్టర్ అంబేద్కర్ వీధి, బెంగళూరుకు పంపాలని గెజిట్‌లో పేర్కొన్నారు.



నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

- ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు రూ. 50 కోట్లు
- గ్రాంట్ల విడుదలపై సీఎం లేఖ
- 25శాతం కోరిన పనులకే
- వివక్షపై ప్రతిపక్ష నేతల ఆగ్రహం






బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నామని చెప్పుకోవడానికేగానీ కనీసం ఓ కాలువ లేదా రోడ్డు, అత్యవసరానికి ఓ బోరు వేయించలేని పరిస్థితిలో ఉన్నామని ఇంతకంటే ఘోరం ఉండదని ఇక ప్రజలు తిరగబడితే రాజీనామా ఒక్కటే శరణ్యమని అది ఏక్షణంలోనైనా సాధ్యం కావచ్చునని కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే రాజు కాగె ఇటీవల బహిరంగంగా విమర్శించిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలోనే మరికొంతమంది ఎమ్మెల్యేలు ఆప్తుల వద్ద పార్టీ సీనియర్ల వద్ద వాపోయారు. ఈ పరిస్థితి ఎక్కడికి దారి తీస్తుందోనని అధిష్ఠానం రంగంలోకి దిగింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సుర్జేవాలా రెండు వారాల వ్యవధిలో 9రోజులపాటు బెంగళూరులో మకాం వేసి ఎమ్మెల్యేలు, ఓడిన అభ్యర్థులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో ప్రభుత్వ తీరుపై అభిప్రాయసేకరణ చేశారు. చాలామంది ఎమ్మెల్యేలు గ్రాంట్లు విడుదల కావడం లేదని అసంతృప్తితో ఉన్నట్లు గుర్తించి సీఎంకు సమాచారం చేరవేశారు. దీంతో సొంత పార్టీ ఎమ్మెల్యేలకు గ్రాంట్ల వరాలు కురిపించారు. ఏకంగా ప్రతి నియోజకవర్గానికి 50 కోట్ల రూపాయలు కేటాయించేలా నిర్ణయం తీసుకున్నారు.

ముఖ్యమంత్రి మౌలిక సౌకర్యాల అభివృద్ధి పథకం కింద నియోజకవర్గానికి రూ.50కోట్లు కేటాయించారు. గ్రాంట్ల విడుదలకు అవసరమైన పనుల వివరాలు సమర్పించాలని అధికార పార్టీ ఎమ్మెల్యేకు సీఎం సిద్దరామయ్య స్వయంగా లేఖ రాశారు. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయం నుంచి కూడా ఎమ్మెల్యేలకు సూచనలతో లేఖలు పంపారు. గ్యారెంటీల భారంతో అభివృద్ధి గ్రాంట్ల విషయంలో సహకరించాలని సీఎం సిద్దరామయ్య ప్రభుత్వం ఏర్పాటైన తొలినాళ్లలోనే విన్నవించారు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చి మూడో ఏడాదిలో అడుగు పెట్టినా కనీసస్థాయిలో పనులు చేయలేకపోతున్నామని సీనియర్ ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సుర్జేవాలా, అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలతోపాటు మంత్రులు ఇతరులతో నేరుగా వేర్వేరుగా చర్చలు జరిపారు. అధికారంలో ఉన్నామని ఏ విధంగా చెప్పుకోవాలని, గ్రాంట్లు విడుదల కావడం లేదని, మంత్రులు మమ్మల్ని పట్టించుకోవడం లేదని, ముఖ్యమంత్రి వద్దకు వెళ్లలేకపోతున్నామని, డీసీఎం మా మాట వినే పరిస్థితిలో లేరని పలువురు ఏకరువు పెట్టినట్టు తెలుస్తోంది. పార్టీలో అసంతృప్తి తారస్థాయికి చేరకుండా కట్టడి చేయాలంటే అందుకు అనుగుణంగా వారి నియోజకవర్గాల్లో కొంతమేర పనులు చేసేలా నిధులు విడుదల చేయాలని అధిష్ఠానం సూచించినట్టు తెలుస్తోంది. ఆ కారణంతోనే నియోజకవర్గానికి 50 కోట్ల రూపాయల చొప్పున గ్రాంట్లు విడుదల చేయదలిచారు.

సుర్జేవాలా 9రోజులపాటు నిర్వహించిన సమీక్షలో 103మంది ఎమ్మెల్యేలు, 20మందికిపైగా మంత్రులతో చర్చించిన విషయం తెలిసిందే. వీటన్నింటి పరిణామం కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు గ్రాంట్ల వరం పండింది. 50 కోట్ల రూపాయల్లో రూ.37.50 కోట్లు మౌలిక సదుపాయాలకోసం కేటాయించి మిగిలిన 25శాతం నిధులలో ఎమ్మెల్యేలకు ఇష్టం వచ్చిన పనులకు వినియోగించుకునేలా వెసలుబాటు కల్పించారు. ఈ ప్రక్రియ నెలాఖరులోగా పూర్తి చేయదలిచారు. ఈనెల 30 నుంచి రెండురోజులపాటు జిల్లాలవారీగా ప్రత్యేకసభలు జరిపేందుకు సీఎం సిద్దరామయ్య నిర్ణయించారు. ఎమ్మెల్యేల విశ్వాసం పొందే ఆలోచనలో ఉన్నారు. విధానసౌధలో జరిగే సభలలో ఎమ్మెల్యేలనుంచి నేరుగా సమ్యలను సీఎం విననున్నారు. నియోజకవర్గాల్లో చేపట్టదలిచిన పనులకు సంబంధించి భరోసా ఇస్తూ వారికి ప్రాధాన్యం ఇచ్చేలా మరిన్ని హామీలు ఇచ్చే అవకాశం ఉంది. జిల్లాల వారీగా సభలు జరుపుతున్నందున గందరగోళం లేకుండా ప్రక్రియను జరపదలిచారు. ఎమ్మెల్యేల విశ్వాసం కొనసాగించడమే ఇందులో భాగమని తెలుస్తోంది. ఆగస్టు 11నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించనున్నందున ఈలోగానే ఎమ్మెల్యేలతో సభలు పూర్తి చేయదలిచారు.

సొంత పార్టీ వారికే ఇవ్వడం అన్యాయం: ప్రతిపక్షాల మండిపాటు

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు రూ.8వేలకోట్ల కేటాయిస్తున్నట్టు ఆర్థికమంత్రి హోదాలో సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. అందులో భాగంగానే ప్రస్తుతం అధికార పార్టీ ఎమ్మెల్యేలకు రూ.50 కోట్ల వరం సాధ్యమవుతోంది. ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్‌లతోపాటు స్వతంత్ర ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల తర్వాత నియోజకవర్గాలకు భారీగా గ్రాంట్లు ఇవ్వదలిచిన ప్రభుత్వం కేవలం సొంత పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే అనే నిబంధన పెట్టుకోవడం సమాఖ్య వ్యవస్థకు సమంజసమేనా ..? అని ప్రశ్నిస్తున్నారు. కొత్త సంప్రదాయానికి ప్రాధాన్యం ఇవ్వరాదని, భవిష్యత్తులో ఇదే పరిస్థితి కొనసాగనుందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. గ్రాంట్ల మంజూరు అంశం వివాదానికి కారణమవుతోంది.



నవరతన్ ఆభరణాల ప్రదర్శనకు విశేష ఆదరణ



ప్రదర్శన ప్రారంభోత్సవంలో నవరతన్ వైస్‌ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నవరతన్ జ్యువెలర్స్ సంస్థ నగరంలో ఏర్పాటు చేసిన ఆభరణాల ప్రదర్శనలకు విశేష ఆదరణ లభించింది. నగరంలో వివిధ జ్యువెల్స్ సంసలు ఏర్పాటు చేసే ప్రదర్శనలకు భిన్నంగా రేస్‌కోర్సు రోడ్డులోని తాజ్ వెస్టెండ్‌లో నవరతన్ జ్యువెల్స్ రెండు రోజుల ప్రదర్శనను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ విదేశీ విభాగం ముఖ్యులు ఆరతి కృష్ణ ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరతికృష్ణ మాట్లాడుతూ మహిళలకు ఆభరణాలంటే ఎంతో ఇష్టమన్నారు. వారు కొత్త డిజైన్లను ఎంపిక చేసి సొంతం చేసుకుందుకు ఆసక్తి చూపుతారన్నారు. అందుకే మహిళలకు సంబంధించి ఆభరణాలు శాస్త్రీయ, కొత్త మోడల్స్‌లు ఎప్పటికప్పుడు వస్తుంటాయన్నారు. నవరతన్ జ్యువెలర్స్ వైస్‌ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి అనేలా నవరతన్ జ్యువెలర్స్ బంగారం, ప్లాటినం, వజ్రాభరణాలు ప్రదర్శిస్తున్నామన్నారు. విశ్వవ్యాప్తంగా నవరతన్‌ను ఓ బ్రాండ్‌గా పరిచయం చేయాలన్నదే తమ ఆశయమన్నారు. అందుకే దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బెంగళూరులో ఏడు ప్రాంతాల్లో నవతరన్ షోరూంలు ఉన్నాయని, ఒక్కోచోట ఒకో మోడల్ ప్రత్యేకం అన్నారు. అన్ని మోడల్స్ ఒకేచోట లభించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరికీ మంచి ఆభరణం సొంతం చేసుకోవాలనే కల ఉంటుందని, అది సాకారం చేసేందుకు నవరతన్ కృషి చేస్తుందన్నారు. బంగారం, వజ్రం, ప్లాటినంతో కూడిన ఆభరణాలు ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నామన్నారు. అరకోటి నుంచి 10 కోట్ల రూపాయల విలువైన ఆభరణాలు ఉన్నాయన్నారు. సాధారణంగా ఇంటికి అవసరమైన మోడ్రన్ ఫర్నీచర్ కొనుగోలు చేస్తారని, కొంతకాలం తర్వాత అవి మార్చాల్సి వస్తుందన్నారు. వెండితో కూడిన ఫర్నీచర్‌ను పరిచయం చేస్తున్నామని, మార్చాలనుకున్న వెండి విలువ ఉంటుందన్నారు. వరమహాలక్ష్మి, గౌరి వ్రతాలకు అవసరమైన పూజా సామగ్రి ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. మరోరోజు మాత్రమే ప్రదర్శనలు ఉంటాయన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డైరెక్టర్లు మహేంద్ర బఫ్నా, నితేశ్ బఫ్నా, సీఓఓ ప్రకాశ్ బఫ్నాలు పాల్గొన్నారు.



ఆభరణాలు పరిశీలిస్తున్న మహిళలు


అభివృద్ధే సమాధానం

- బీజేపీ, జేడీఎస్‌వి తప్పుడు ప్రచారాలు
- బహిరంగ చర్చకు సిద్ధం
- మైసూరు సాధనా సమావేశంలో సీఎం



వేదికపై సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు

బెంగళూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్ పార్టీలు ప్రజలను దారి తప్పించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారికి మా అభివృద్ధే సమాధానమని, పనులు చేయలేదంటే బహిరంగ చర్చకు రావాలని సీఎం సిద్దరామయ్య సవాల్ విసిరారు. మైసూరులో శనివారం రాష్ట్రప్రభుత్వం రెండేళ్ల సాధనా సమావేశం జరిగింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, డీసీఎం డీకే శివకుమార్ తోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప, విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. 2,578 కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపన అనంతరం సీఎం సిద్దరామయ్య బహిరంగసభను ఉద్దేశించి మాట్లాడారు. తమ ప్రభుత్వ సాధనలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎప్పుడూ సొంతంగా అధికారంలోకి రాలేదన్నారు. ఆపరేషన్ కమల ద్వారానే కుర్చీ దక్కించుకున్నారన్నారు. జేడీఎస్ ప్రభావం తగ్గుతోందన్నారు. మేం జేడీఎస్‌లో ఉన్నప్పుడు 59స్థానాలు గెలిచామని ఇటీవలి ఎన్నికల్లో వారు గెలిచింది 19 స్థానాలే అన్నారు. ఎక్కువసీట్లు ఎందుకు గెలవలేకపోతున్నారంటూ పార్టీ నేతలు దేవేగౌడ, కుమారస్వామిలను ప్రశ్నించారు. మరోసారి బీజేపీ-జేడీఎస్ కలసి పోటీ చేసినా అధికారంలోకి రాలేరన్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ కాలం నుంచి మన్మోహన్ సింగ్ దాకా సామాజిక న్యాయానికి అనుగుణంగానే పథకాలు రూపొందించి దేశమంతటా విస్తరింపచేశామన్నారు. ఆహారభద్రత, తప్పనిసరి విద్య, ఉపాధిహామీ వంటివి కాంగ్రెస్ సాధనలని, బీజేపీ ఏం చేసిందో చెప్పగలరా అన్నారు. అనంతరం జరిగిన రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సభలో ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఖర్చు, శ్రమతో చదువుతున్నామని గుర్తెరగాలన్నారు. తర్వాత చాముండేశ్వరి విద్యుత్ సరఫరా సంస్థ ఉద్యోగి విధి నిర్వహణలో మృతిచెందిన జూనియర్ పవర్‌మ్యాన్ మహేశ్ (27) కుటుంబానికి రూ.1.06కోట్ల పరిహార చెక్కును అందచేశారు.




ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

పోలీసు విచారణకు
హాజరుకండి

- బీజేపీ ఎమ్మెల్యే బైరతి బసవరాజ్‌ను మందలించిన హైకోర్టు

బెంగళూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని కేఆర్‌పుర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే బైరతి బసవరాజ్‌ను హైకోర్టు ధర్మాసనం తొలుత పోలీసుల విచారణకు వెళ్లాలంటూ తీవ్ర స్థాయిలో మందలించింది. కేఆర్‌పుర పరిధిలో రౌడీషీటర్ శివ ప్రకాశ్ అలియాస్ బిట్లు శివ హత్య కేసులో ఎమ్మెల్యే ఏ5గా ఎఫ్ఐఆర్ నమోదైంది. విచారణకు హాజరు కావాలని భారతినగర్ పోలీసులు ఎమ్మెల్యే బసవరాజ్‌కు నోటీసులు ఇచ్చారు. ఈలోగానే బైరతి బసవరాజ్ భారతినగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోర్టు హైకోర్టులో పిటిషన్ వేశారు. శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి ఎస్ఆర్ కృష్ణకుమార్ ధర్మాసనం తీవ్రంగా మందలించింది. ముందుగా పోలీసు విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్యే బైరతి బసవరాజ్‌ను ధర్మాసనం ఆదేశించింది. కేసును ఈనెల 23కు వాయిదా వేసింది.



అర్ధరాత్రి మహిళా ఎమ్మెల్యే ఆందోళన

- ఇన్‌చార్జ్ మంత్రి హామీ ఇచ్చినా ఆగని వసూళ్లు
- టోల్‌గేట్ల ఏర్పాటుపై దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ ఆగ్రహం



టోల్‌గేట్ వద్దే నిద్రించిన ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

రాయచూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి మహిళా ఎమ్మెల్యే ఆందోళనకు దిగారు. మంత్రి హామీ ఇచ్చినా చర్యలు శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్మలా క్రాస్ నుంచి తింథిణి బ్రిడ్జ్ వరకు గల రహదారిలో ఏర్పాటు చేసిన రెండు టోల్‌గేట్‌ల వ్యవహారం చిలికిచిలికి గాలివానగా మారుతోంది. 40కి.మీ వ్యవధిలో రెండు టోల్‌గేట్‌లు ఏర్పాటు చేశారని, ఇది వాహనదారులకు అత్యంత భారమని వీటిని తొలగించాలంటూ దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ గత కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయం పై మాట్లాడిన ఆమె శుక్రవారం జరిగిన కేడీపీ సభలో నేలపై కూర్చొని ఆందోళన చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి తాత్కాలికంగా టోల్‌గేట్‌ల వసూలు నిలిపివేయాలని, అందుకు సంబంధించిన అధికారులకు తగిన ఆదేశాలివ్వాలంటూ అక్కడే జిల్లాధికారిని ఆదేశించారు. ఇంత జరిగినా కేడీపీ సమావేశం ముగించుకుని తిరిగి సాయంత్రం దేవదుర్గకు వెళుతున్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ అక్కడ యథావిధిగా టోల్‌గేట్ వసూలు జరుగుతుండడాన్ని చూసి ఆగ్రహానికి గురయ్యారు. రాత్రి వరకు అక్కడే అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, అర్ధరాత్రి వేళ రోడ్డు పై బైఠాయించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె రోడ్డు పై మహిళా ఎమ్మెల్యే అర్ధరాత్రి వేళ ఆందోళన చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో సాగుతున్న నిర్లక్ష్య పాలనకు ఇదే నిదర్శనమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉదయం వరకూ అక్కడే నిరసన పాటించారు.



తెల్లవారుజామున.. అక్కడే బైఠాయింపు

5

డీసీఎం కాన్వాయ్‌లో
వాహనం బోల్తా

- ఇద్దరు సిబ్బందికి గాయాలు

బళ్ళారి కమ్మ మహాజన సంఘం

రి:5/1945

పాత కోర్టు రోడ్డు, బళ్ళారి,కర్ణాటక.

2024-2025వార్షిక సర్వసభ్య సమావేశం తేదీ:20-07-2025 ఆదివారం ఉదయం 10.30 గం॥లకు సంఘ కార్యాలయ ఆవరణమున జరుపబడును. సదరు నోటీసును ఫోను మరియు వాట్సాప్ ద్వారా సభ్యులందరికీ పంపడమైనది. సభ్యులందరూ తప్పక హాజరు కాగోర మనవి.

నోటీసు అందనివారు దీనినే తమ వ్యక్తిగత ఆహ్వానంగా భావించి పాల్గొనవలెనని కోరడమైనది.

సమావేశానంతరం కమ్మని విందు భోజనం.

బళ్ళారి :20-07-2025

అధ్యక్షులు, కార్యదర్శి మరియు కార్యనిర్వాహక వర్గ సభ్యులు



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,618.03
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	34,023	1.06,723
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	33,716	404
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	55.97



వేరుశనగ పొలంలో నిలిచిన వర్షపు నీరు

విజయనగరంలో జోరువాన

బళ్లారి సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు గ్రామాల్లో పంటలు దెబ్బ తిన్నాయి. శనివారం ఉదయం కూడా వాతావరణం మేఘావృతంగా ఉంది. జిల్లాలోని హొసపేటలో శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రంతా కొనసాగింది. జంబునాథ్ గ్రామ ప్రాంతంలోని పంటలను ముంచెత్తింది. చారిత్రాత్మక రాయర సరస్సు ప్రాంతంలో ఉన్న జంబునాథ్ గ్రామ ప్రాంతంలోని వందలాది ఎకరాల్లో పండించే రైతుల పంటలు దెబ్బతిన్నాయి. దీని వల్ల రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు.

ఎమ్మెల్యేతో ఎస్పీ భేటీ



ఎమ్మెల్యే గవియప్ప దంపతులతో ఎస్పీ జాహ్నవి

హోస్పేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా కొత్తగా బాధ్యతలను స్వీకరించిన ఎస్పీ జాహ్నవి శనివారం విజయనగరం ఎమ్మెల్యే గవియప్ప, ఆయన సతీమణి సమేతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతలు కాపాడాలని, సుపరిపాలన అందించడంలో సహకరిస్తానని హామీ ఇచ్చారు.

పేటె ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం శనివారం సందర్భంగా పేటె ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వాముల వారికి ప్రత్యేక పుష్పాలంకార సేవలు చేశారు.

పాము కాటుతో చిన్నారి మృతి

రాయచూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా హోన్నటగి గ్రామంలో నిద్రిస్తున్న చిన్నారి పాము కాటుకు బలయ్యింది. హోన్నటగి గ్రామానికి చెందిన నాలుగేళ్ల సిరియమ్మ(4) శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. తల్లిదండ్రులు బాలికను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో బాలిక కన్నుమూసింది.



సిరియమ్మ(ఫైల్)

అమ్మకాల్లో అవకతవకలు..!

● జొన్న కొలుగోలు కేంద్రాల్లో గోల్‌మాల్ ● రైతుల ఎఫ్ఐడీతో 5,424 క్వింటాళ్లు... ఆంధ్రా నుంచి తెచ్చి అమ్మేశారు

బళ్లారి గాంధీనగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జొన్న ఖరీదు కేంద్రాల్లో భారీ అవకతవకలు బయట పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో తక్కువ ధరకు జొన్నను కొనుగోలు చేసి కర్ణాటక రాష్ట్రంలో జొన్న కొనగోలు కేంద్రాల్లో ఎక్కువ ధరకు అమ్మినట్లు, అందుకు సిరుగుప్ప తాలూకా పరిధిలోని పలు ప్రాంతాల రైతుల ఎఫ్ఐడీని ఉపయోగించి అక్రమ అమ్మకాలు జరిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిరుగుప్ప తాలూకా పరిధిలోని పలు స్టేషన్‌లలో కేసులు నమోదు కావడం, రైతుల కొనుగోలు కేంద్రాల్లో జొన్న కొనుగోళ్లలో అవకతవకలు తెరపైకి వస్తున్నాయి. సరిగ్గా ఇదేరీతిలో మూడేళ్ళ క్రితం అదే సిరుగుప్ప తాలూకా జొన్న కొనుగోలు కేంద్రాల్లో కోట్లాది రూపాయలు అవకతవకలు జరిగాయి. అయితే ఆ కేసు ఇంకా విచారణ దశలో ఉండగానే మళ్ళీ సిరుగుప్ప తాలూకాలో ప్రభుత్వం ప్రారంభించిన జొన్న కొనుగోలు కేంద్రాల్లో గోల్‌మాల్ వ్యవహారం వెలుగు చూడడం జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. 2024-25 రబీ సీజన్‌లో పండిన జొన్న పండించిన రైతులు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో రైతుల నుంచి జొన్న ఖరీదు కోసం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. దీంతో సిరుగుప్ప తాలూకా పరిధిలోని వందలాది మంది రైతులకు సంబంధించిన ఫ్రూట్ ఐడీని ఉపయోగించి ఒకేమొబైల్ నెంబరు ద్వారా నమోదు చేయించి జొన్న ఉత్పత్తులు రైతులు కొనుగోలు కేంద్రాల్లో మధ్యవర్తవర్తులు అమ్మకాలు జరిపినట్లు ఘటన వెలుగుచూసింది. మధ్యవర్తి, కొనుగోలు కేంద్రం నమోదు అధికారి అవినీతికి పాల్పడినట్లు ఇప్పటికే కేసు నమోదు అయింది. వీరితో పాటు స్థానిక రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధ్యవర్తిగా ఒకరు 36మంది ఎఫ్ఐడీని ఉపయోగించి 1224 క్వింటాళ్ళు, మరో రెండు నెంబర్లు ఉపయోగించి 72మంది రైతుల నుంచి 4వేల క్వింటాళ్ళ జొన్నను అక్రమంగా పేర్లు నమోదు చేయించి అమ్మకాలు జరిపినట్లు పోలీసులకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయంలో జొన్న ఖరీదు కేంద్రాల్లో అక్రమాలు జరిగినట్లు సిరిగేరి పోలీసు స్టేషన్‌లో ఆహార పౌర సరఫరా శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు స్పందించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాలూకా పరిధిలోని సిరుగుప్ప, కరూరు ఫిర్కా ప్రాంతంలోని 10 ఖరీదు కేంద్రాల్లో జొన్న సాగు చేసిన 2046మంది రైతులు ఖరీదు కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటిలో ఖరూరు ఫిర్కా పరిధిలో ఉత్తనూరు గ్రామంలో రైతులు సంబంధించిన ఎఫ్ఐడీలు ఒకే మొబైల్ నెంబరు నుంచి నమోదు జరిగినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ సిరిగేరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే కేసు విచారణ నిమిత్తం సిరుగుప్ప స్టేషన్‌లో బదిలీ చేసినట్లు, ప్రస్తుతం కేసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. పశువుల మేతకోసం బీహార్‌కు వెళుతున్న జొన్న, సీమాంధ్ర ప్రాంతంలో విత్తన జొన్నను మధ్యవర్తుల ద్వారా క్వింటాల్ రూ 1800 నుంచి రూ 2000 చొప్పున కొనుగోలు చేసి అదే జొన్నను కర్ణాటకలో రైతుల మద్దతు ధర కేంద్రాల్లో క్వింటాల్ రూ 3,371లకు అమ్మకాలు జరిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తెక్కలకోట వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

పురసభ సిబ్బందికి డాక్టర్ మరియంబి సూచన

బళ్లారి సిటీ,జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో నీటి వనరులను కాపాడుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, నీటిని సరఫరాచేసే సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని జిల్లాసర్వేయర్ డాక్టర్ మరియంబి అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ , బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేషన్ హాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డ్రైయినేజీ పక్కన తాగునీటి పైప్‌లైన్ వెళ్తే, నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. పైప్ లైన్ శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తిస్తే ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ పరిమాణాన్ని వెయ్యి టీటర్లకు నాలుగు గ్రాములు(33శాతం) నిర్ణయించడం ద్వారా క్లోరినేషన్ పద్ధతిని తప్పకుండా అనుసరించాలని, నీటిని సరఫరా చేసే మెట్రోపాలిటన్ కార్పోరేషన్ సిబ్బందికి సూచించారు. వాంతులు, విరేచనాలు ప్రబలితే ఆరోగ్య శాఖ అందిచే ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి 24గంటల్లోపు తాగాలన్నారు. కుటుంబంలో ఎవరికైనా వాంతులు, విరేచనాలు సంభవిస్తే నీటిని మరగించి ఫిల్టర్ చేసిన నీటిని అందించాలని సూచించారు. ప్రజలు అందరూ నాణ్యమైన నీటిని అందిస్తూ నిరంతర నీటిపరీక్షలు నిర్వహించుకోవాలని, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ తన ఉద్యోగులకు ఆరోగ్య శాఖ ఇచ్చిన సాంకేతిక సలహాలను పాటించాలని, ముఖ్యంగా నీటి శుద్ధి సమయంలో సాంకేతిక చర్యలను పాటించాలని ఆదేశించారు. నీటి సరఫరా సమయంలో అన్ని లేఔట్లలో నీటి పైపులు ఉన్న ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకూడదని ప్రజలకు అవగామణ కల్పించాలన్నారు. ఈసందర్భంగా మహానగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ,అసిస్టెంట్ కార్యనిర్వాహక ఇంజనీర్, నగర వార్డుల జూనియర్ ఇంజనీర్లు, ఆరోగ్యశాఖ సర్వే కార్యాలయం ,జిల్లా కాల్ కంట్రోల్ బృందం అధికారులు సిబ్బంది, అలాగే మహానగర పాలక సంస్థ నీటి సరఫరా కార్మికులు, మురుగునీటి పారుదల కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మరియంబి

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే

కంప్లి, జూలై19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని సండూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం అన్నారు. శనివారం తాలుకా సమీపంలోని దరోజీ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆమె మాట్లాడుతూ రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు వంటి వివిధ అభివృద్ధి పనులతో పాటు ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ రోడ్లు, పాఠశాల భవనాలు సహా వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రూ. 49.50 లక్షల వ్యయంతో కేకేఆర్‌డీబీకి చెందిన మూడు పాఠశాల గదులకు శంకుస్థాపన చేశారు. పాత దరోజీ గ్రామంలో పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో కేపీటీసీఎల్ సీఎస్ఆర్ గ్రాంట్ కింద సుమారు రూ. 40 లక్షల వ్యయంతో పాఠశాల భవనం, కేకేఆర్‌డీబీ సుమారు రూ. 75 లక్షలు వ్యయంతో సీసీ రోడ్డు, మురుగునీటి పారుదల, వడ్డు గ్రామంలో సుమారు రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, మురుగునీటి పారుదల పనులు, హోసా దరోజీలో సుమారు రూ. 75 లక్షల వ్యయంతో 5054 ఎస్‌సీపీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయని, కాంట్రాక్టర్లు గడువులోపు నాణ్యతతో పనులు చేయాలన్నారు. హోస దరోజీలో మార్కెట్ అభివృద్ధి ఎస్‌హెచ్‌పీ పాఠశాల కొత్త గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ సభ్యులు జనార్దన్, మాజీ గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు గురుమూర్తి, ప్రస్తుత గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు గీత, గణేష్, ఉపాధ్యక్షురాలు గౌరమ్మ, పీడీవో పక్కీరప్ప, జేఈ దేవరాజ్, నాయకులు విశ్వేశ్వరయ్య, పీఎస్ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం

నగరపాలికె ఎన్నికలు నిర్వహించండి

● మాజీ మేయర్ ఇబ్రహీంబాబు



మాట్లాడుతున్న మాజీ మేయర్ ఇబ్రహీంబాబు

బళ్లారి సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): బళ్లారి మహానగర పాలక వర్గం గడువు ముగియడంతో త్వరలో ఎన్నికలు నిర్వహించాలని, మేయర్ స్థానాన్ని ఈసారి మైనార్టీలకు కానీ కురుబ సమాజానికి కానీ కేటాయించాలని బీజేపీ మాజీ మేయర్ ఇబ్రహీంబాబు కోరారు. నగరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ముస్లీం, కురుబ వర్గాల వారికి మేయర్ పదవి ఇవ్వలేదని, ఈసారి అవకాశం కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో నగరం పరిశుభ్రతను కోల్పోయిందని, వీధిదీపాలు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా అయ్యిందని, తాగునీరు పది రోజులకోసారి సరఫరా చేస్తున్నారన్నారు. విద్యుత్ కోత పెరిగిపోయిందని, బీజేపీ ప్రభుత్వం హయంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇంత వరకు పూర్తిచేయలేదన్నారు, గడిగిచెన్నప్ప సర్కిల్ టవర్‌క్లాక్, అనంతపురం రోడ్డు, సిద్దార్థ కాలనీలో చేపట్టిన క్లీనిక్‌ను, నగంలోని పలు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో కేఎస్, అశోక్, గోవిందరాజులు, హనుమంతప్ప శ్రీనివాస్ ఎమోత్కార్, సరేఖ మల్లనగౌడ, బీజేపీ ప్రముఖులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వైఎం సతీష్‌రెడ్డి

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

బళ్లారి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని శనివారం ఎమ్మెల్సీ వైఎం సతీష్‌రెడ్డి ప్రారంభించారు. బళ్లారి నగరంలోని 10వ వార్డు మర్రిస్వామి మఠం ప్రాంతంలో రూ.16.45 లక్షలతో భవనాన్ని నిర్మించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ చిన్నారులకు అనుకూలం ఉండాలనే కాలనీకి సమీపంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించామన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలను అంగన్‌వాడీలకు పంపి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ గతంలో సొంత భవనం లేక అద్దెభవనంలో కేంద్రం నడిపేవారమని, నేడు సొంత భవనంలోకి మారడం ఆనందకరమన్నారు. వార్డు ప్రజలు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏడుపడగల నాగప్ప ఆలయానికి హుండీ



హుండీ అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ చంద్రశేఖర్

కంప్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): బుక్కసాగర అడవుల్లో వెలసిన ఏడు పడగల నాగప్ప ఆలయానికి బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ మేనేజర్ చంద్రశేఖర్ హుండీని వితరణ చేశారు. శనివారం ఆలయంలో హుండీని అందజేసిన ఆయన బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా వితరణ చేశామన్నారు. బుక్కసాగర గ్రామంలో ఈ ప్రాంతంలోని రైతులు, వినియోగదారులకు రుణ సదుపాయాలను అందించడానికి ఓ శాఖను ప్రారంభించిందని ఆయన తెలిపారు. ప్రజలు బ్యాంకిగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పురోహితులు విశ్వనాథ స్వామి, గ్రామసభ్యులు శశిధర్, బ్యాంకు సిబ్బంది, వినోద్, హులిగప్ప, ప్రహ్లాద, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డుల్లో రూ. 50లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, మురుగునీటి పారుదల పనులకు ఎమ్మెల్యే గణేష్ శనివారం భూమిపూజ చేశారు. పట్టణంలోని 3, 5 9, 12 వార్డుల్లో 2024-25సంవత్సరానికి కేకేఆర్‌డీబీసీఎండీక్యూ 2515 పథకం కింద సుమారు రూ. రెండు కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు, మురుగు నీటి పారుదల పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించా లన్నారు. వార్డు 5లో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో చాలా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. 7వ వార్డులో దాదాపు రూ.1.50 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణంతో సహా వివిధ అభివృద్ధి పనులు జరిగాయని, పట్టణంలోని కొన్ని వార్డుల్లో చిన్నచిన్న పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. దాదాపు రూ.7.50 కోట్లు వ్యయంతో శిథిలావస్థకు చేరుకున్న మున్సిపల్ భవనాన్ని బాగు చేస్తామన్నారు. పాత బస్టాండ్‌ను రూ. రెండు కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తామని, రూ.3 కోట్ల వ్యయంతో అగ్నిమాపక దళం భవన నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. సోమప్ప సరస్సు అభివృద్ధికి సుమారు రూ.5 కోట్లు కేటాయించామన్నారు. ఈ విధంగా పట్టణంలో చాలా అభివృద్ధి పనులతో ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించడానికి పూనుకు న్నామన్నారు. స్థలం కోసం చాలా డిమాండ్ వుంది. భూమి కోసం పరిశీలన చేపడుతున్నామన్నారు. ఎవరైనా రైతు పది ఎకరాల భూమిని ఇస్తే ప్రభుత్వం గ్రాంట్ అందిస్తుందని, ఆ స్థలాన్ని పేద, మధ్య తరగతి ప్రజలకు కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షులు బట్టా ప్రసాద్, ఉపాధ్యక్షుడు సుశీలమ్మ, సభ్యులు సీఆర్ హనుమంత, కేఎస్ చాంద్ బాషా, నాగమ్మ, సత్యప్ప, గుడుడమ్మ, శ్రీనివాస్, సుమా రఘు, ముఖ్య అధికారి మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి బీఎస్ శేషనాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీటి నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేయాలి

● జడ్పీ సీఈఓ మహ్మద్ అలీ అక్రమ్ షా

హోస్పేట, జూలై19(ఆంధ్రజ్యోతి): జేజేఎం పనుల నిర్వహణ, నిర్వహణను నిర్వహించడానికి గ్రామ పంచాయతీ ద్వారా గ్రామీణ తాగునీరు, పారిశుధ్య కమిటీని ఏర్పాటు చేయాలని పంచాయతీ ముఖ్య కార్య నిర్వహణాధికారి జడ్పీ సీఈఓ నోంగ్ జోమ్ మహ్మద్ అలీ అక్రమ్‌షా అన్నారు. హోస్పేట తాలూకాలోని బెళగోడు, కల్లిరాంపూర్, కలఘట్ట, నరసపూర్, కద్దిరాంపుర, బెనకాపుర, మలపనగుడి గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు కింద పూర్తయిన పనులను ఆయన శనివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ తాగునీరు, పారిశుధ్య కమిటీని సక్రమంగా చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్యాచరణ,నిర్వహణ విధానాన్ని అమలు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామాలను 27ఇంటూ 7గ్రామాలుగా ప్రకటించాలని ఆయన కోరారు. వోజేఎం పథకాన్ని ఉపయోగించుకోవాలని, తాగునీటి పైపులైన్లలో మీటర్లు అమర్చడం ద్వారా ప్రజలకు నీటి విలువ తెలుస్తుందన్నారు. గ్రామీణ తాగునీరు, పారిశుధ్యవిభాగం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ దీప,తాలూకా వైద్యాధికారి బసవరాజు, ట్యాప్ ఈఓ ఎండీ ఆలంబాష, సీఆర్‌ఈడీ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.



తాగునీటిని పరిశీలిస్తున్న సీఈఓ

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

బళ్లారిరూరల్, జూలై19(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని కుంటనహాళ్ గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జునగౌడ్(66) మృతికి మాజీ మంత్రి నాగేంద్ర నివాళి అర్పించారు. శుక్రవారం రాత్రి చేరుకున్న నాగేంద్ర మల్లికార్జున గౌడ్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.. ఆయన ఆత్మశాంతి చేకూరాలని కనక దుర్గమ్మ దేవుని ప్రార్థి స్తు న్నా నన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాగేంద్ర

హోసూరు జోన్

బస్టాండ్‌లో దుర్గంధం

హోసూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు బస్టాండ్‌లో నెలకొన్న దుర్గంధానికి విముక్తి కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం వందలాదిమంది బస్టాండ్‌కు రాకపోకలు సాగిస్తారు. బస్టాండ్ ప్రదేశంలో స్వచ్ఛత పాటించకపోవడంతోపాటు మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో దుర్గంధం నెలకొంది. పొగాకు నమిలి ఉమ్మివేయడం, బహిరంగ ప్రదేశంలో మూత్ర విసర్జన, బస్టాండ్‌లో సరైన నిర్వహణ లేదు. బస్టాండ్ ప్రాంతాన్ని బాగు చేయాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగునీరు

వార్డుల్లో స్వచ్ఛత పనులు

హోసూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ కమిషనర్ షబ్బీర్ ఆలం ఆదేశాలతో ప్రతి వారం నాలుగు వార్డులలో స్వచ్ఛతా పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం 9, 11, 27, 42వ వార్డులలో స్వచ్ఛతా పనులు నిర్వహించారు. కార్పొరేషన్ స్వచ్ఛతా సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు కూడా పాల్గొని పారిశుద్ధ పనులు చేపట్టారు. నగరంలో స్వచ్ఛతకు ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పురపాలక సిబ్బంది



నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

602 మందికి ఉద్యోగాలు

హోసూరు, జూలై19(ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం, ఉపాధి కెరీర్ మార్గదర్శకం ఆధ్వర్యంలో హోసూరులోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటైన ప్రైవేట్ జాబ్‌మేళాలో 602మంది ఎంపికయ్యారు. వివిధ ప్రముఖ కంపెనీలు పాల్గొని అవసరమైన మానవ వనరులను ఎంపిక చేసుకున్నాయని కలెక్టర్ దినేశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఎంపికైనవారికి కలెక్టర్ దినేశ్‌కుమార్, మేయర్ సత్య ధ్రువీకరణపత్రాలు అందచేశారు. శనివారం ఏర్పాటైన మేళాలో 114 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా 2,512మంది నమోదు చేసుకున్నారు. గ్రామీణ జీవనోపాధి జిల్లా ప్రాజెక్టు అధికారి పెరియస్వామి, జిల్లా ఉపాధి అధికారి గౌరిశంకర్, దివ్యాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

బళ్లారి సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్న దుర్గమ్మ ఆలయంలో శనివారం దుర్గట్రస్ట్, వివేకానంద రక్తదాన కేంద్రం, నందకళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆలయ అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ మాట్లాడుతూ.. రక్తదానంతో ఎందరో ప్రాణాలు కాపాడిన వారం అవుతారన్నారు. ఈసందర్భంగా మాజీ కార్పోరేటర్ క్రిష్ణ, రమేశ్, సత్యనారాయణ, ఆలయ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దాతలు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలతో విద్యార్థులు

బళ్లారి సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): నగరంలో కరిమారెమ్మ కాలనీప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఝాన్సీ రాణీ లక్ష్మీబాయి సంఘ సేవాసంఘం, కర్ణాటక దళిత సంఘర్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ఎస్‌డీఎం అధ్యక్షులు సిద్దమ్మ, ఆదాయ పన్ను శాఖ అధికారులు విజయలక్ష్మి, కౌల్‌బజార్ పోలీస్‌స్టేషన్ పీఎస్ఐ అధికారి లారెన్స్ వారి ధర్మ పత్ని సుగుణ, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

కవికొండల వెంకటరావు (జయంతి)



తొలితరం తెలుగు రచయితలలో ఒకరైన కవికొండల వెంకటరావు 1892 జూలై 20న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ప్రాంతంలోని శ్రీరంగపట్నంలో జన్మించారు. 300కుపైగా కథలు రాశారు. 1929లో పుస్తకరూపంలో వెలువడ్డాయి. మొదటిది 'పొట్టికత'. రెండు నవలలు, విజన సదనము, కోనసీమ సాంఘిక నవల 'ఇనుపకోట', ఇంకా చదువుల దుత్త, చిట్టి కైత తదితర ఖండకావ్య సంపుటాలు రాశారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితోరాసిన దేశభక్తి గేయాలు 'మాతృదేశ సంకీర్తనము' పేరిట వెలు వడింది. ఆయన కథలు పలు పత్రికలలో పోటా పోటీగా ప్రచురితమయ్యాయి. 1969 జూలై 4న దివంగతులయ్యారు.

శారదాదేవి (వర్ధంతి)



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస భార్య శారదాదేవి యోగినిగా, శారదా మాతగా పేరొందారు. 1853 డిసెంబరు 22న పశ్చిమబెంగాల్ రాష్ట్రం జయరాంబాటిలో జన్మించారు. శిష్యులు ఆమెను హోలీమదర్, శ్రీ మా అని సంబోధించేవారు. ఈవిడను ఆదిశక్తి అవతారంగా భావిస్తారు. గురువు మరణం తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక సలహా, సందేహ నివృత్తికైనా శారదాదేవిని అడిగేవారు. 1920 జూలై 20న పరమపదించారు.

గుగ్లిఎల్మో మార్కోనీ (వర్ధంతి)



ఇటలీ దేశ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్ గుగ్లిఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ 1874 ఏప్రిల్ 25న జన్మించారు. సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపేందుకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పితామహుడిగా గుర్తింపు పొందారు. కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్‌తో కలసి వైర్‌లెస్ టెలిగ్రాఫీపై భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1937 జూలై 20న కన్నుమూశారు.

నసీరుద్దీన్ షా (పుట్టినరోజు)



బాలీవుడ్ ప్రముఖ నటుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత నసీరుద్దీన్ షా 1950 జూలై 20న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బారాబంకీలో జన్మించారు. నాటకరంగంలోనూ, వెండితెరపైన నటుడిగా, దర్శకుడిగా పేరొందారు. ఐదు జాతీయ అవార్డులు, 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. కర్మ, మీర్జా గాలిబ్, ది పెర్‌ఫెక్ట్ మర్డర్, సర్ఫరోష్, ది లీగ్ ఆఫ్ ఎక్స్‌ట్రార్డినరీ జెంటిల్‌మెన్ సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు.

అరుణిమ సిన్హా (పుట్టినరోజు)



ప్రపంచంలోని అత్యున్నత శిఖరం ఎవరెస్టును అధిరోహించిన దివ్యాంగ మహిళ అరుణిమ సిన్హా 1988 జూలై 20న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం అంబేద్కర్ నగర్ ప్రాంతంలో జన్మించారు. దుండగుల దురాగతంలో కుడికాలు పోగొట్టుకున్న జాతీయ స్థాయి వాలీబాల్ మాజీ క్రీడాకారిణి. తన 25వ యేట ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఇతర పర్వతాలను కూడా అధిరోహించారు. 'బోర్న్ అగైన్ ఆన్ ది మౌంటెన్' అనే పుస్తకాన్ని రాయగా ప్రధాని మోదీ ఆవిష్కరించారు. పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

డిజిటల్ రూపంలో సంస్కృత శిక్షణ

బెంగళూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): సాంకేతిక యుగంలో సంస్కృత భాషను డిజిటల్ రూపంలో నేర్పేందుకు శ్రీకారం చుట్టారు. వ్యోమాలింగ్విస్టిక్స్ ల్యాబ్స్ ఫౌండేషన్ సంస్థ ఓటీటీ ద్వారా సంస్కృతం నేర్పే ప్రక్రియను శనివారం ప్రారంభించారు. పద్మభూషణ్ గ్రహీత క్రిస్ గోపాలకృష్ణన్, ఐఐఎం రిటైర్డు ప్రొఫెసర్ బీ మహదేవన్, సంస్కృత శిక్షకురాలు, సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ వాణిశ్రీ రఘుపతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ దూరదృష్టితో సాంకేతికం ద్వారా జ్ఞానసంపదను అందరికీ విస్తరింప చేయదలిచినట్టు తెలిపారు. ఇంటర్‌ఫేజ్ ఏఐ టెక్నాలజీతో డిజిటల్ శాన్‌స్క్రిట్ డాట్‌కామ్ ద్వారా అన్ని వయస్సుల ద్వారా సంస్కృతం భాషను నేర్చుకోవచ్చునన్నారు. వ్యోమాలింగ్విస్టిక్స్ ల్యాబ్స్ ఫౌండేషన్ సంస్థ సీఈఓ డాక్టర్ సీపీ విశ్వనాథన్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా సంస్కృత, సంస్కార, సంస్కృతి (3ఎస్) ద్వారా లక్షలాదిమంది సంస్కృత భాషను నేర్చుకున్నారు. సంస్కృతం మన భారతీయ సంస్కృతికి పునాదిలాంటిదన్నారు. భాష నేర్చుకోవడం ద్వారా ఎంతో లాభం ఉంటుందన్నారు. పిల్లలకోసం సంస్కార బీజాన్ని, సంస్కార గీతాన్ని ప్రారంభించారు. ఎక్కడివారైనా సంస్కృతం నేర్చుకోదలచుకుంటే వెబ్‌సైట్ ద్వారా సంప్రదించవచ్చునన్నారు. సాధారణ ఫీజుతో భాషను నేర్చుకునేందుకు ఓటీటీ ప్లాట్‌ఫాంను తీసుకొచ్చామన్నారు.



ప్రారంభోత్సవంలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత క్రిస్ గోపాలకృష్ణన్

రోడ్డు విస్తరణను పరిశీలించిన అధికారులు



పరిశీలిస్తున్న సీఐ తదితరులు

దొమ్మసంద్ర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దొమ్మసంద్ర మెయిన్ రోడ్డు నుంచి దొమ్మసంద్ర సర్కిల్ వద్ద అత్యధిక ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో రోడ్డు విస్తరణ కు సిద్ధమయ్యారు. రోడ్డు విస్తరణకు అవసరమైన భూమికోసం చుట్టుపక్కల భూయజమానులతో చర్చించి సానుకూలం అయ్యేలా సఫలీకృతులయ్యారు. రోడ్డు విస్తరణ పనులను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునిల్‌పవార్, యమరె గ్రామపంచాయతీ పీడీఓ ప్రవీణ్‌కుమార్, కేఆర్‌డీసీఎల్ అధికారులు పరిశీలించారు. సుమారు ఎనిమిదేళ్లక్రితం 2017 లో దొమ్మసంద్ర సర్కిల్ బ్రిడ్జ్ నిర్మించడానికి 19 కోట్లతో టెండరు దక్కించుకుని పనులు చేపట్టారు. అయితే నిర్మాణాలు ఇంతవరకు పూర్తి కాలేదు. పనులు జాప్యం కావడంతో నిర్మాణవ్యయం పెరిగింది. ప్రభుత్వం అదనపు నిధులు రూ.40కోట్లను విడుదల చేసినా ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ తరుణంలో పనులు వేగిరం చేయాలనే డిమాండ్ పెరగడంతో స్థానిక అధికారులు శనివారం పరిశీలన చేశారు. తాలూకా కేఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి హరీశ్‌కుమార్, బెంగళూరు దక్షిణ నియోజకవర్గ కేఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి తదితరులు రోడ్డు విస్తరణ పనులను వేగిరం చేయాలని కోరారు.

అభివృద్ధికి ఎమ్మెల్యే అడ్డు: మాజీ ఎంపీ

బొమ్మనహళ్ళి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బొమ్మనహళ్ళి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 10వేల మొక్కల కార్యక్రమానికి అడ్డుకట్ట వేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డిపై మాజీ ఎంపీ ఉగ్రప్ప మండిపడ్డారు. హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లోని వాజ్‌పేయ్ క్రీడా మైదానంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మొక్కల నాటే కార్యక్రమానికి దారితప్పేలా ఎమ్మెల్యే వ్యాఖ్యానిస్తున్నారంటూ ఆరోపించారు. కార్యక్రమం విజయవంతం కావడంతో ఓర్చుకోలేక ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరికాదన్నారు. పర్యావరణవేత్త ఎల్లప్పరెడ్డిని రప్పించి మాట్లాడించారన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం ఒకరోజుకే పరిమితం కాలేదని, వారం రోజుల కార్యాచరణగా ఉందన్నారు. ఇంతవరకు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నీవు ఒక్కసారైనా ఇలాంటి కార్యక్రమం చేపట్టారా..? అంటూ ప్రశ్నించారు. తొలుత అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. తాను కూడా రైతుబిడ్డ అని, మొక్క విలువ తెలుసు అని, మొక్కలను వృథా చేయమన్నారు. అభివృద్ధి చేయకుండా తమపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మీ సొంత హొంగసంద్ర ప్రాంతంలో రోడ్డును విస్తరించలేదన్నారు. చాలాచోట్ల అభివృద్ధి పనులు నాసిరకంగా ఉన్నాయంటూనే మైదానం ప్రారంభమైన వారం రోజులకే షెల్టర్ కూలిపోయిన అంశాన్ని గుర్తు చేశారు. స్థానిక నాయకుడు ఉమాపతిగౌడ మాట్లాడుతూ పచ్చదనం పెంచే ఇంతటి భారీ కార్యక్రమం గత 15ఏళ్లలో ఎక్కడ చేపట్టారో చూపాలన్నారు. తాము చేపట్టిన పచ్చదనం కార్యక్రమానికి స్వయంగా అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ప్రారంభించి కొనియాడారన్నారు. అనివార్య కారణాలతో సీఎం పాల్గొనలేదన్నారు. మీడియా సమావేశంలో హెచ్‌ఎస్‌ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేంద్ర, బొమ్మనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, బిలేకహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ధనంజయ, లోకేశ్‌రెడ్డి, ఉమ్‌రాజ్, దిలీప్, వెంకటరమణప్ప, చిక్కణ్ణ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉగ్రప్ప

కరగ.. కనుల పండుగ..



అగ్నిగుండంలో కరగధారి

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నందిని లే అవుట్‌లోని శ్రీదేవి, మారెమ్మ దేవాలయాల నుంచి పద్మావతి అమ్మవారి 44వ పూలకరగ ఉత్సవం భక్తిపారవశ్యంతో సాగింది. మాజీ మంత్రి గోపాలయ్య, ఆలయ ధర్మాధికారి వెంకటేశ్ తదితరులు ఉత్సవాలను ప్రారంభించారు. శుక్రవారం రాత్రి 10.30గంటలకు అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఓ మహిళ పూలకరగను మోయడం ప్రత్యేకం అనిపించింది. పద్మావతి అమ్మవారి కరగను యశ్వంతపుర ఏపీఎంసీ యార్డ్, శంకరనగర్, మారప్పనపాళ్య తదితర ప్రాంతాలలో ఊరేగించారు. ప్రతిచోటా భక్తులు కరగపై పూలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామీణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

విజయపుర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంత ప్రజలు తమ వ్యవసాయ పనులతోపాటు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని ఏస్టర్ సీఎంఐ ఆసుపత్రి ప్యాలెటివ్ మెడిసినల్ లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ రాఘవేంద్ర రామాంజులు తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద మానస పాలిక్లినికల్ ఏర్పాటైన ఉచిత ఆరోగ్య శిబిరంలో ఎండో వ్యాస్కులర్, ఒంటినొప్పులు ఇతర పరీక్షలు చేశారు. మూడు నెలలకంటే ఎక్కువరోజులుగా నొప్పులు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని నిర్లక్ష్యం చేయరాదని సూచిం చారు. సర్జన్ కృష్ణచైతన్య మాట్లాడుతూ బీపీ, షుగర్ సమస్యలతో ఇతరత్రా సమస్యలు తలెత్తాయన్నారు. డాక్టర్ రాజేశ్, టీచర్ రుద్రేశమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు

అంతర్జాతీయ అవకాశాలు

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు అంతర్జాతీయస్థాయిలో వేదిక కల్పించేలా కార్యక్రమాలు కల్పించడం అభినందనీయమని బయో ఇంధన అభివృద్ధి మండలి అధ్యక్షుడు, కేపీసీసీ ఉపాధ్యక్షుడు ఎస్ఈ సుధీంద్ర అభిప్రాయపడ్డారు. నగరంలో ఉయ్ వైశ్య అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్యాలెస్ గ్రౌండ్స్ ప్రిన్సెస్‌లో ఏర్పాటైన గ్రేస్ ఎక్స్‌పో 2.0లో శనివారం పాల్గొని మాట్లాడారు. 'స్టాప్ థింకింగ్ ఐ, స్టాప్ థింకింగ్ ఉయ్' అనే నినాదంతో ముందుకు సాగుతున్నారన్నారు. అమెరికా, దుబాయ్ తదితర దేశాలనుంచి విచ్చేసిన వెయ్యిమందికిపైగా పారిశ్రామికవేత్తలకు ఒకే వేదిక కల్పించడం అభినందనీయమన్నారు. సాంకేతిక, రాజకీయ, సాంస్కృతికంగా మరిన్ని అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఎక్స్‌పో ఏర్పాటు చేసిన అసోసియేషన్ ఫౌండర్ అనిల్ గుప్త, ఆయన బృందం కార్యవైఖరిని ప్రశంసించారు. ఈ సందర్భంగా మురళి, సుప్రీత్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌పోలో బయో ఇంధన అభివృద్ధి మండలి అధ్యక్షుడు సుధీంద్ర, అనిల్ గుప్తా తదితరులు

ఘనంగా గంధోత్సవం



దర్గాకు పుష్పాలంకరణ

చింతామణి రూరల్, జూలై19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డైమండ్ టాకీస్ రోడ్డులోని సయ్యద్‌బాను బీ అమ్మజాన్ గంధోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగాయి. గంధోత్సవం కార్యక్రమాన్ని జామియా మసీదు సమీపానగల సయ్యద్ కరీంసాబ్ ఇంటి నుంచి గంధం తీసుకుని బయలుదేరారు. సయ్యద్‌బాను బి అమ్మజాన్ దర్గా, హజరత్ శాలి దివానస్ రహంతుల్లా అలై, బద్రున్నిస్ అమ్మాజాన్, హజరత్ ఢల్లి చిరాగ్ దర్గాలకు గంధం సమర్పించారు. గంధోత్సవంలో పాల్గొన్న భక్తులకు భోజన వ్యవస్థ కల్పించారు. దర్గా కమిటీ సభ్యులు అక్రమ్‌పాషా, సయ్యద్ టిప్పు, ఇలియాజ్ పాషా, ఆసిఫ్, చాంద్‌పాషా, షబ్బీర్ అహ్మద్, సౌండ్ సిస్టమ్ గిడ్డు ఫైరోజ్, సాకిబ్ తదితరులు పాల్గొన్నారు. గంధోత్సవంలో ఎటుచూసినా సందడి నెలకొంది.

రోటరీ సేవలు ప్రశంసనీయం

ముళబాగిలు, జూలై 19(ఆంధ్రజ్యోతి): రోటరీ ముళబాగిలు సెంట్రల్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరంలో అధ్యక్షులుగా నగవార సత్యణ్ణ నేతృత్వంలో చేపట్టిన సామాజిక సేవలకు జిల్లా రోటరీ సంస్థ ఫైవ్‌స్టార్ డైమండ్ పురస్కారం అభినందనీయమని కోలారు జేడీఎస్ నాయకుడు, పారిశ్రామికవేత్త సీఎంఆర్ శ్రీనాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని రోటరీ భవనంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాలూకాలో రోటేరియన్‌లు వివిధ రకాల సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేయూతగా నిలిచారన్నారు. ఇవి మరింతమందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. రోటరీ మాజీ అధ్యక్షుడు నగవార సత్యణ్ణ, సీనియర్ లక్ష్మీనారాయణ, గ్రామ వికాస డైరెక్టర్ ఎంవీఎన్ రావ్, రోటరీ ముళబాగిల్ సెంట్రల్ అధ్యక్షుడు తిప్పదొడ్డి ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రమేశ్, జిల్లా రోటరీ కార్యదర్శి ఎన్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రొటేరియన్ ప్రముఖులకు సన్మానం

దళితులకు రక్షణ కల్పించాలని వినతి

బళ్లారిరూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ అడవుల్లో వందలాది మంది మహిళల మృతదేహాలను అక్రమంగా పారవేయడానికి సాక్షిగా ఉన్న పేద దళిత వ్యక్తికి భద్రత కల్పించాలని, కేసు త్వరగా దర్యాప్తు చేయాలని కర్ణాటక సమత సైనిక దళం కార్యాధ్యక్షుడు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్‌కు అందించి వ్యక్తికి భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విరంతరలో వివరణ తెలపాలని దానికి సంబంధించిన కేసును విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమత సైనిక సభ్యులు జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ సండప్ప, మురళి, శాంత, లక్ష్మీదేవి, రోహిణి, శాంత, కమల, పద్మ, దాక్షాయని, తదితరులు పాల్గొన్నారు.

మస్కి జలాశయం నుంచి

నీటి విడుదల



జలాశయం నుంచి దిగువకు వస్తున్న నీరు

రాయచూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లాలోని ప్రసిద్ధ జలాశయం మస్కి జలాశయంలో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో జలాశయం నుంచి శనివారం భారీగా నీటిని దిగువకు విడుదల చేశారు. వాగులోకి నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండడంతో వాగు అంచున ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

నిరుపయోగంగా

పరిశ్రమల భవనం



శిథిలావస్థలో పరిశ్రమల భవనం

సిరుగుప్ప, జూలై19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిశ్రమల భవనం నిరుపయోగంగా మారింది. పరిశ్రమల శాఖ నిధుల కింద రూ.15 లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ఎందుకు ఉపయోగానికి రాకుండా నిరుపయోగంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి భవనాలు నిరుపయోగంగా వదిలివేయడంతో అధికారుల నిర్లక్ష్యం ప్రత్యక్షంగా కనపడుతుంది. ప్రభుత్వాలు ఇంకా నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు మండిపడుతున్నారు.

మేళాలో పలువురికి ఉద్యోగాలు

బెంగళూరు, జూలై19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగమేళాలు నిరంతరం జరగాలని తద్వారా కంపెనీలకు అవసరమైన మానవ వనరులు సాధ్యమని జైన్ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ అభిప్రాయపడ్డారు. బసవనగుడిలోని జైన్ కళాశాల కనెక్ట్ 2 పేరిట వాసవి క్యాంపస్‌లో శనివారం ఉద్యోగమేళాను ఏర్పాటు చేశారు. 3,900మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 65 కంపెనీలు భాగస్వామ్యం అయ్యాయి. జైన్ గ్రూప్ విద్యాసంస్థలకు అనుబంధమైన 20 కళాశాలలనుంచి పాల్గొన్నారు. 2,100మంది ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఇది కేవలం ఉద్యోగాల నియామకం కోసమే కాదని విద్య, పరిశ్రమ, ప్రతిభల మధ్య ఉండే తారతమ్యాన్ని వేదిక ద్వారా పరిష్కరించేందుకు సాధ్యం కానుందన్నారు. బీఏ, బీబీఏ, ఎంబీఏ, బీకామ్, ఎంకామ్, ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



జయాకర్‌కు సన్మానం

శిడ్లఘట్ట, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యాయవాదుల సంఘా నికి తెలంగాణ రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యుడు, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయాకర్ బైరపాక విచ్చేశారు. ఈ సందర్భంగా వారిని ఆత్మీయంగా సత్కరిం చారు. తాలూకా న్యాయవాదులసంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, కార్యదర్శి సీజీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో హైదరాబాద్ ప్యారడైజ్ రుచులు

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా హైదరాబాద్‌లో పేరొందిన ప్యారడైజ్ రుచులు నగరంలో అందుబాటులోకి తెచ్చింది. ప్యారడైజ్ కబాబ్ ఫెస్టివల్ పేరిట జయనగర్‌లో ప్రారంభించినట్టు సంస్థ సీఓఓ రబీందర్‌సింగ్, వైస్‌ప్రెసిడెంట్ స్వతంత్ర గౌతంలు తెలిపారు. జమ్ము- కశ్మీర్‌లోని జెఫ్రాని కల్మి కబాబ్, మధ్యప్రదేశ్‌లోని రేష్మి మలై, నీలగిరి చికెన్, మహారాష్ట్రలోని తేచా పన్నీర్, రాజస్థాన్‌లోని మతనియా పన్నీర్‌ల పేరిట కబాబ్‌లు పరిచయం చేస్తున్నామన్నారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

అంబులెన్స్ లేక.. ఆర్టీసీ బస్సులో తరలింపు

చింతామణి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి కారకుడైన ద్విచక్ర వాహన చోదకుడిని బస్సు ద్వారానే ఆసుపత్రికి తరలించారు. వివరాలిలా. బెంగళూరు- చింతామణి రాష్ట్ర రహదారిపై చన్నసంద్ర గ్రామం వద్ద అతివేగం, నిర్లక్ష్యంగా వచ్చిన బైక్, ఆర్టీసీ బస్సును వెనుకనుంచి ఢీ కొంది. ప్రమాదంలో బైక్ చోదకుడు 41ఏళ్ల కృష్ణ గాయపడ్డారు. బెంగళూరు కాడుగూడి ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదం జరిగింది. ఢీ కొన్న శబ్దానికి బస్సు డ్రైవర్ వెంటనే ఆపాడు, కండక్టర్ పరిశీలించగా బైక్‌పై వచ్చిన వ్యక్తి కిందపడి గాయపడ్డాడు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో అతడిని అదే బస్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



బాధితుడి తరలింపు ఇలా..

పురస్కార గ్రహీతకు సన్మానం



శివలింగప్పను సన్మానిస్తున్న పాత్రికేయులు

బళ్లారిరూరల్, జూలై19(ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలో ని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న పత్రికా భవనంలో శనివారం ఉదయం కేంద్ర సాహిత్య అకాడమీ బాల పురస్కార సమితి శివలింగప్పను విలేకరుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివలింగప్ప మాట్లాడుతూ సాహిత్యం ఎన్నో విషయాలను తెలియజేస్తూ, ప్రపంచానికి సత్తా చాటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీరభద్రగౌడ, మోకా మల్లయ్య, హరిశంకర, ఎంకోబి మంజునాథ, గురుశాంత్ పురుషోత్తంతో పాటు మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారికి షోకాజ్ నోటీస్

● కేడీపీ సమావేశంలో రమ్మీ ఆడటంపై చర్యలు

రాయచూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కీలకమైన కేడీపీ సమావేశంలో రమ్మీ ఆడి ఓ జిల్లా అధికారి బుక్కయ్యారు. ఓ వైపు సీరియస్‌గా కేడీపీ సమావేశం జరుగుతుండగా అటవీ శాఖ అధికారి ప్రవీణ్ తన ఫోన్‌లో రమ్మీ గేమ్ ఆడుతూ కూర్చున్నారు. దీన్ని గమనించిన కొంతమంది వీడియో తీసి వైరల్ చేయడంతో సమస్య మంత్రి ఈశ్వర్ ఖండ్రె దృష్టికి వెళ్లింది. వెంటనే సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసులివ్వాలని తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో జిల్లాధికారి సదరు అధికారికి నోటీసులిచ్చారు. ఇదే విషయం మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్ సంబంధిత అధికారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.



సభలో రమ్మీ ఆడుతున్న ప్రవీణ్ (ఫైల్)

